క్లుప్తంగా

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్, తిరుపతి నిర్వాహకులు పాల్గొననున్నారని తెలిపారు. ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్, ప్రాసెస్ స్పెషలిస్ట్, టీమ్ లీడ్, అసిస్టెంట్ మేనేజర్, టెక్నికల్ హెల్ప్‌డెస్క్ సపోర్ట్ ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు. డిగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని, కంప్యూటర్ సైన్స్ వారికీ అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తి గల వారు ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైమ్): ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర నాయకుడు వై.శ్రీహరి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

జేవీవీ విజ్ఞాన గీతాల సీడీ ఆవిష్కరణ



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక విజ్ఞాన గీతాల సీడీని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కాలేషా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే జేవీవీ రాష్ట్ర కళాజాత నేపథ్యంలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు విజ్ఞాన పాటల సీడీని ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ ఎ.విజయ్‌కుమార్, కళాకారులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, గోపినాథ్, ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, యూటీఎఫ్ నాయకుడు చలపతి శర్మ, ప్రజానాట్య మండలి నాయకులు శేషయ్య, సాహితీ ప్రవంతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



నెల్లూరు(వేదాయపాళెం): సంక్రాంతిని పురస్కరించుకుని నెల్లూరు సిరి హాల్ ఎదురుగా ఉన్న జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయం సమీపంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 50 డివిజన్ కార్పొరేటర్ జయలక్ష్మి, 8వ డివిజన్ కార్పొరేటర్ కామాక్షి దేవి విచ్చేసి ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖజానా వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ మహిళా కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఏలూరు బాబు ఆచారి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శానంపూడి మహేశ్వరి, నగర అధ్యక్షురాలు జయలక్ష్మి, మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు పాలూరు జ్యోతి, ఏలూరు కవిత, పేట శ్రీదేవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా..



కోవూరు: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీహరి



పొదలకూరు: విజేతలతో ఎంపీడీఓ నగేష్‌కుమారి

పొదలకూరు : ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయి బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను స్థానిక డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించారు. సచివాలయాల పరిధిలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాల్‌బాడ్మింటన్‌లో వావింటపర్తిపై దుగ్గుంట, ఆర్‌వైపాళెంపై పొదలకూరు, నేదురుమల్లిపై తాటిపర్తి, బిరదవోలుపై మరుపూరు జట్లు విజయం సాధించాయి. కబడ్డీలో పీజీపట్నంపై మరుపూరు, తోడేరుపై దుగ్గుంట జట్లు గెలుపొందాయి. ఖోఖోలో నావూరుపై మరుపూరు క్రీడాకారులు విజయం సాధించారు. వాలీబాల్ పోటీల్లో మొగళ్లూరుపై విరువూరు క్రీడాకారులు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కోవూరు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా స్థానిక కొత్తూరులోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల క్రీడాప్రాంగణంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీడీఓ శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలకు సంబంధించిన జట్లు మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతగా నిలిచిన క్రికెట్ జట్టును నియోజకవర్గ స్థాయికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రహీం, పీడీలు దేవిక, డెలీలా, పీఈటీలు వెంకటసుబ్బమ్మ, జాన్సన్, ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో జిల్లా అదనపు జడ్జి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయిని జిల్లా అదనపు జడ్జి జీ కపర్థి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ జడ్జిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యం



కంటి అద్దాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఇందుకూరుపేట: ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని జగదేవిపేట పీహెచ్‌సీ హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ద్వారా అందిస్తున్న సేవలపై మండలంలోని లేబూరులో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి సర్పంచ్ వరిగొండ సుమతి చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకుడు వరిగొండ బాబయ్య, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు: ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ శ్రీహరి పేర్కొన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అభివద్ధి ప్రణాళికలను రూపొందించడమే కాకుండా వాటిని అమలుపరిచే బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో అందుబాటులో ఉండే వనరులతో స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ రహీం, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మ ఉత్సవాలు ప్రారంభం



పుట్టమట్టిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

మనుబోలు: స్థానిక చంద్రమౌళీనగర్‌లో గొబ్బెమ్మ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సంక్రాంతి నెల ప్రారంభమైనప్పటి నుంచి మహిళలు గొబ్బెమ్మలు ఆడుతూ ఇంటింటికెళ్లి నగదు, వంట సామగ్రి సేకరిస్తారు. సంక్రాంతి పండగ ముగిసిన తరువాత గొబ్బెమ్మ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గిరిజనులు గ్రామ సమీపంలోని చెరువు వద్ద నుంచి పుట్ట మట్టిని బుధవారం ఊరేగింపుగా తీసుకొచ్చి చావడి వద్ద గౌరీదేవిని తయారు చేసి ప్రతిష్ఠించారు. మూడ్రోజుల పాటు గౌరీదేవికి సంప్రదాయబద్ధంగా పూజలు జరిపి చివరిరోజు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నేడు మొగళ్లూరులో భూ పట్టాల పంపిణీ

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో గురువారం ఉదయం 10.30 గంటలకు పేదలకు భూ పట్టాలను పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ కే వీరవసంతరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలను అందజేస్తారని చెప్పారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



పొదలకూరు : స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి గడ్డం మస్తాన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న దంపతులు రూ.లక్ష నగదు విరాళాన్ని బుధవారం అందజేశారు. అశ్వ వాహనం తయారీ కోసం నగదు విరాళాన్ని ఆలయ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డికి అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, అల్లూరు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కోవూరు: స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం అన్నదానం చేశారు. సంక్రాంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా పడుగుపాడు సహకార సొసైటీ సీఈఓ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం చేశారు.

చీరల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ మహిళా వలంటీర్లకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని తమ వార్డు పరిధిలో సేవలు అందిస్తున్న మహిళా వలంటీర్లకు చీరలు అందజేసినట్లు తెలిపారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రైసైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన తిరువాయిపాటి శ్రీనివాసులు, కోవూరు చెందిన పిండి శేషయ్య, షేక్ ఇస్మాయిల్‌లకు ట్రైసైకిళ్లను అందజేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో దివ్యాంగులు ట్రైసైకిళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయడంతో తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. డీఏఏబీ చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అల్లాబక్షు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులు సంస్కృతికి చిహ్నాలు



బహుమతులు అందజేస్తున్న ట్రెయినీ డీఎస్పీ హేమలత

కోవూరు: రంగవల్లులు సంస్కృతికి చిహ్నాలని ట్రెయినీ డీఎస్పీ హేమలత పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా ది లైట్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు సహకారంతో కోవూరులోని కోనేటి కయ్యల ప్రాంతంలో నిర్వహించిన రంగవల్లులు, స్లో సైక్లింగ్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ట్రెయినీ డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగా ఏటా ది లైట్ హార్ట్స్ ఫౌండేషన్ రంగవల్లుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గౌరీ, తన్మయ్, భరత్‌కుమార్, చక్రి. శ్యామ్, వేణు, తేజ, అనూష్‌రెడ్డి, మదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్ల ఆవిష్కరణ



కోవూరు : ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ఐటీ ఆర్మీలో చేరాలనుకునే వారు జగన్ ఐటీ ఆర్మీ.కామ్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ఐటీ విభాగం సభ్యులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ముమ్మడి శ్రీనివాసులరెడ్డి, జిల్లా అధ్యక్షులు కొప్పోలు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుగుండ్ల శశికుమార్‌రెడ్డి, హైదరాబాద్ ఐటీ విభాగం సభ్యుడు హేమకుమార్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు రాజావర్ధన్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ఏడో వార్డు కౌన్సిలర్ షేక్ షకీలబేగం, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు డాక్టర్ అల్లాబక్షు, తదితరులు పాల్గొన్నారు.

పిండ మార్పిడితో మేలు జాతి పశువులు వృద్ధి



ముర్రా జాతి దూడను పరిశీలిస్తున్న గొల్లపల్లి విజయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు

ఇందుకూరుపేట: కృత్రిమ గర్భాధారణ విధానంలో పిండి మార్పిడి ప్రక్రియ ద్వారా మేలుజాతి పశువుల వృద్ధి సాధ్యమని ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని గంగపట్నంలో శ్రీనివాసులు అనే పాడి రైతుకు చెందిన గేదె పిండ మార్పిడి విధానంలో ముర్రాజాతి పెయ్య దూడకు జన్మనిచ్చింది. ఈ దూడను అధికారులతో కలిసి విజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో చింతలదేవి పశుక్షేత్రంలో తయారు చేసిన ఏడు రోజుల ఘనీకృత ముర్రాజాతి పిండాన్ని డాక్టర్లు నరేష్, వసంతరాయులు గతేడాది మార్చి 13న శ్రీనివాసులుకు చెందిన గేదెలో ఉచితంగా ప్రవేశపెట్టారని తెలిపారు. సంక్రాంతి శుభదినాన ఈ నెల 15న ఆ పశువు ముర్రాజాతి పెయ్యదూడకు జన్మనిచ్చిందని చెప్పారు. ఈ విధానంలో మేలుజాతి పశువులను తక్కువ ఖర్చుతో పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే ప్రప్రథమంగా ఘనీకృత పిండ మార్పిడి ద్వారా ముర్రా జాతి జననం మన రాష్ట్రానికి సాధ్యమైందని సంతోషం వ్యక్తం చేశారు. పిండమార్పిడి విధానంతో స్వదేశీ జాతుల వృద్ధి అతి తక్కువ సమయంలోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్డీఏ ఈఓ సోమయ్య, పశువైద్యులు నరేష్, వసంతరాయులు, నాయకులు పెనుబల్లి హనుమంతరావునాయుడు, పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహిధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, వెటర్నరీ అసిస్టెంట్లు తోపుగుంట జగదీష్, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న అరుణమ్మ

నెల్లూరు రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూర్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బుధవారం రాత్రి ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. షటిల్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన చాముండేశ్వరి, ద్వితీయ బహుమతి గెలుపొందిన ఫ్రేమ్-2 జట్లను అభినందించారు. క్రికెట్‌లో మొదటి స్థానంలో ఏ-11, రెండో స్థానంలో ఫైటర్స్ జట్లు నిలవగా వారిని అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాగే క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం ఏర్పడేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏటి పండగ కోలాహలం



ఏటి పండగకు తరలివచ్చిన నగర ప్రజలు



గొబ్బెమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు



పినాకిని నది తీరంలో కొలువుదీరిన దేవతామూర్తులను దర్శించుకుంటున్న భక్తులు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో పెన్నా నది తీరంలో బుధవారం సాయంత్రం ఏటి పండగ కోలాహలంగా జరిగింది. నగర ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సందడి చేశారు. సంప్రదాయ ఏటి పండగను భక్తిభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్న సంకల్పంతో కులమతాలకు అతీతంగా తరలివచ్చిన ప్రజానీకంతో పినాకినీ తీరం హోరెత్తింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై హుషారెత్తించే సినీగీతాలు.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరూ వీక్షించి ఉల్లాసంగా గడిపారు. ధనుర్మాసంలో తమ ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజించిన గొబ్బెమ్మలను (గౌరమ్మలను) గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. తమ ఇంటిల్లిపాదికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. సంప్రదాయంలో భాగంగా ఒకరికొకరు కుంకుమబొట్లు పెట్టుకుంటూ పసుపు, కుంకుమ, గాజులను గంగమ్మకు సమర్పించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటి పండగ సందర్భంగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీని విద్యుద్దీపాలతో నయనానందకరంగా అలంకరించారు. విద్యుద్దీపాలంకరణలో, భారీఎత్తున ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పినాకినీ తీరం కళకళలాడింది.

కులమతాలకు అతీతంగా..

కులమతాలకు అతీతంగా నగర ప్రజలు ఏటి పండగకు తరలిరావడంతో రంగనాయకులపేట, గోపురంవీధి, శెట్టిగుంటరోడ్డు, మైపాడురోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, సంతపేట పరిసరాలు రద్దీగా మారాయి.

కొలువైన దేవతామూర్తులు

జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దేవతామూర్తులు పినాకినీ తీరంలో కొలువై భక్తులను కటాక్షించారు. ఈ ఏడాది దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో గణనాథుడు, రాజరాజేశ్వరిదేవి, శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, మూలాపేట భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి, జొన్నవాడ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు, వేదగిరి లక్ష్మి నృసింహస్వామి, సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

22న శ్రీరాముడి శోభాయాత్ర

పొదలకూరు : పట్టణంలో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు శ్రీరాముడి భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు బుధవారం తెలిపారు. అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రామనగర్‌గేటు సెంటరు నుంచి రామమందిరం మీదుగా వెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు శోభాయాత్ర సాగుతుందని చెప్పారు. శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మనుబోలు: వెంకటాచలం, మనుబోలు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నెల్లూరులో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనుబోలు మండలంలోని మనుబోలు కోదండరామపురం, అక్కంపేట, కొలనకుదురు (ఎస్సీకాలనీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, వెంకన్నపాళెం, వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం(ఎస్సీకాలనీ), కంటేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లోని సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇంటర్వ్యూ కాల్‌లెటర్, దరఖాస్తు రెసెప్ట్‌తో నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.